www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 22 జూన్ 2023
5
అన్నమయ్య

వాహనం ఢీకొని దుప్పి మృతి

మృతి చెందిన దుప్పి

ప్రజాశక్తి-రామాపురం

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే... మండలంలోని కసిరెడ్డిగారిపల్లె సమీ పంలోని పాలకొండ నుంచి దుప్పి గ్రామ శివారులో పంట పొలా ల్లోకి వెళ్లింది. దుప్పిని కుక్కలు తరమడంతో తప్పించుకునే క్రమంలో రోడ్డు దాడుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింనట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రెడ్డప్ప తెలిపారు. రాయచోటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మృతి చెందిన దుప్పిని శవ పరీక్ష నిమిత్తం గువ్వల చెరువు పశువుల వైద్యశాలకు తరలించారు. డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి శవ పరీక్ష నిర్వహించారు. శవ పరీక్ష అనంతరం ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారులు దుప్పికి దహన సంస్కారాలు చేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గాయత్రి, బేస్ క్యాంప్ సిబ్బంది నాగేష్, గోపాల్, రెడ్డయ్య పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్‌బాబు

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం ఎంతో ప్రతిసాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలలో సంతృప్తికర స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని ఎపి డెయిరీ డెవలప్ మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్ బాబు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సభాభవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వివిధ శాఖలలో వచ్చిన అర్జీలపై కలెక్టర్ గిరీషతో కలిసి ఆయన అన్ని శాఖల హెచ్ఒడిలతో సమక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా క్లియర్ చేయాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్పీ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మదనపల్లె, రాయచోటి, ఆర్‌డిఒలు మురళి, రంగస్వామి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సి.గురుప్రకాష్ రావు, డిపిఒ ధనలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజ్, హౌసింగ్ పీడీ శివయ్య, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనీమియా నివారణపై ప్రత్యేక చర్యలు

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయానికి వచ్చే సర్వీసులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని అహ్మద్ బాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎస్‌బిఐ కాలనీ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ గిరీషతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చే సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం రామారావు కాలనీ అంగన్వాడీ సెంటర్‌ను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని, అందుకోసం ఈ నెల 30న జిల్లా వ్యాప్తంగా జరుగు ధర్నా కార్య క్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లిలో విద్యుత్ పోరు బాట పేరుతో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు వారికొచ్చిన అధిక బిల్లులను సిపిఎం నాయకులకు చూపిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, అధిక ధరలు, విద్యుత్ బిల్లులపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లా డుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపటం దారుణమన్నారు. అప్పుల కోసం వైసిపి ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సంస్కరణలకు దాసోహం అవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న బిజెపి నేతలు స్మార్ట్ మీటర్లపై అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేయగలరా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో సోలార్ విద్యుత్ రేట్లు యూని ట్‌కు రూపాయి యాభై పైసలకు పడిపోయిందని, అయినా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. పట్టణ ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉందని తెలిపారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు, అదనపు కస్టమర్ ఛార్జీలు వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కార్పొరేట్ కంపెనీలకు తప్ప ప్రజలకు ప్రయోజనం ఏమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారం పడుతుందని, చిరువ్యాపారుల నుండి చిన్న పరిశ్రమల వరకూ ప్రతిఒక్కరూ బాధితులేనని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అన్ని పట్టణాల్లో వర్తక, వాణిజ్య సంఘాలు, కాలనీ అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, పౌర సంఘాలతో కలిసి 30న ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ భారాలపై సిపిఎం ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్య పరుస్తుందన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే, బాదుడని విమర్శించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి బాదుడులో అందరిని మించిపోయారని విమర్శించారు. విద్యుత్ సంస్కరణలతో కార్పొరేట్ కంపెనీలు బాగుపడ్డాయని, విద్యుత్ రంగం నాశనం అయ్యిందని, ఫలితంగా ప్రజలపై తీవ్రమైన భారాలు పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేంద్ర, పవన్, రమణ, భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

వైద్య ఆరోగ్యశాఖలో ఫెవికాల్ వీరులు

వైద్యఆరోగ్య శాఖ జోన్-4లో పలువురు ఫెవికాల్ వీరులు తిష్ట వేశారు. సిఫారసు లెటర్ల మాటున దశాబ్దాల తరబడి ఉన్నచోటనే పాతుకుపోయారు. ఆర్‌డి కార్యాలయం రికార్డుల నిర్వహణ చేయకపోవడంతోనే ఇటువంటి పరిస్థితి తలెత్తిందనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా వందలాది మంది అర్హులైన ఉద్యోగులకు అన్యాయం చోటుచేసుకుంటోంది. పలుకుబడి కలిగిన ఉద్యోగులు ఏళ్ల తరబడి ఉన్నచోటనే పాతుకుపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. తాజాగా ఈ నెల 20, 21, 22వ తేదీల్లో ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు చేపట్టిన బదిలీల్లోనైనా ఇటువంటి ఉద్యోగులను బదిలీ చేయాలని కోరుతూ పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

20 ఏళ్లుగా రుయాలో పలువురు తిష్ట

స్పౌజ్ సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యం?!

గ్రామీణ ప్రాంత ఉద్యోగుల ఫిర్యాదులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్యఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో 15 విభాగాలకు సంబంధించి నాలుగు పాత ఉమ్మడి జిల్లాల్లో సుమారు ఎనిమిది వేల మంది ఉద్యోగులు ఉన్నారు. కడప రీజినల్ డైరెక్టర్ ప్రాంతీయ కార్యాలయం ఈ నెల 20, 21, 22వ తేదీల్లో చేపట్టిన బదిలీలకు 700 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 శాతం నిబంధన కింద 525 మంది రెండేళ్ల రిక్వెస్ట్ బదిలీలు, ఐదేళ్ల కాలపరిమితి నిండిన ఉద్యోగుల పారామీటర్ల కింద బదిలీలకు అర్హులైనట్లు సమాచారం. ఉదాహరణకు తిరుపతి రుయా ఆస్పత్రిలో ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు సుమారు 20 ఏళ్లుగా తిష్ట వేసుకుని కూర్చున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. వీరందరూ నాయకుల సిఫారసు లెటర్ల మాటున తిష్ట వేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఒకే చోట ఏళ్ల తరబడి ఉండడంతో కిందిస్థాయి ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి తరహాలో పలుకుబడిన కలిగిన ఉద్యోగులు పాతుకుపోవడంతో దశాబ్దాల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఏళ్ల తరబడి సీనియారిటీ కలిగిన ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లోనే మగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇదేతరహాలో నకిలీ స్పౌజ్ సర్టిఫికెట్ల పేరుతో పలువురు ఉద్యోగులు సీనియారిటీ కలిగిన ఉద్యోగుల అవకాశాలకు గండి కోడుతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మిగిలిన నాలుగు విభాగాల పరిధిలో వందలాది మంది ఉద్యోగులు ఫెవికోల్ తరహాలో పాతకుపోయి ఉన్నారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఆర్‌డి కార్యాలయ అధికారులు సిఫారసు లెటర్ల మాటున అర్హులైన ఉద్యోగులకు మొండిచేయి చూపించారు. సిఫారసు లెటర్లను కలిగిన ఉద్యోగుల బదిలీల విషయంలో అర్హులైన ఉండి, సీనియారిటీ కలిగిన ఉద్యోగుల ఆమోదం పొందిన అనంతరం బదిలీ అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహంలేదు. లేకపోతే దశాబ్దాల తరబడి అర్హత కలిగిన సీనియర్ ఉద్యోగుల గ్రామీణ ప్రాంతాల్లోనే మగ్గిపోవాల్సి వస్తోందనే అంశాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన వైద్య సిబ్బంది

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

జడ్‌పి చైర్మన్ శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు

వాల్మీకిపురం: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం, జగనన్న సురక్షపై చర్చించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి, రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జడ్‌పి చైర్మన్ శ్రీనివాసులును స్థానిక వైసిపి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఎఒ శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి నిర్మల, ఉప సర్పంచ్ కేశవరెడ్డి, నాయకులు నీళ్లభాస్కర్, రాయుడు, ఆనంద పాల్గొన్నారు.

మేధస్సును పెంచేందుకే క్విజ్ పోటీలు : ఎల్‌డిఎం

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా 8, 9, 10వ తరగతులు చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో ఆలిండియా ఆర్‌బిఐ స్కూల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల స్థాయి పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను ఒక టీముగా ఎన్నుకుని నిర్వహించామన్నారు. ఈ క్విజ్‌లో ప్రతిభ కనపరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండవ బహుమతిగా రూ. 4వేలు, మూడో బహుమతిగా 3 వేల నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు ఈ నెల 28న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి జులైలో రాష్ట్ర స్థాయి, తర్వాత జాతీయ స్థాయిలో ఆర్‌బిఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలుంటాయన్నారు. తెలిపారు. డిఇఒ పురుషోత్తం సహకారంతో మండల స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించామన్నారు.


విద్యార్థులకు ప్రశంసా పత్రం ఇస్తున్న ఎల్‌డిఎం వెంకటేశ్వరరెడ్డి

ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా రమణయ్య

రాయచోటి: ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసిరిపాటి బ్రహ్మయ్య ఆదేశాలతో రాష్ట్ర కో- కన్వీనర్ ఎస్ రామాంజనేయులు సహకారంతో యండపల్లి గ్రామం బుడ్డ వాండ్లపల్లెకు చెందిన పెదివీటి రమణయ్యను జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్తగా చేసిన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారని తెలిపారు. జిల్లాలో మాదిగలను చైతన్య పరుస్తూ ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం అహర్నిశలు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జులై 7న విజయవాడలో నిర్వహించిన మా దిగల జనజాగృతి సభకు వేలాదిగా తరలివచ్చి సభను జయ ప్రదంచేయాలని పిలుపునిచ్చారు.

సర్పంచ్ పేరు లేకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చీకలబైలు గ్రామ పంచాయతీ సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలకంలో సర్పంచ్ ప్రభాకర్ పేరు లేకపోవడం, సమాచారం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ అధ్యక్షులు నాగినేని గోవిందు తీవ్రంగా ఖండించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీకలబైలు సర్పంచ్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ప్రారంభంలో స్థానిక సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా ప్రారంభించడం సరికాదన్నారు. బిసిలకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం అన్యాయం చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న, జిల్లా కార్యదర్శి చెన్నం వెంకటరమణ, కొల్లబైలు గ్రామ గౌరవ అధ్యక్షులు చిన్న రెడ్డప్ప, వాల్మీకి బోయ సంఘం పెద్దలు చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్యానికి హాని చేసే వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రచారం చేశారు. బుధవారం పట్టణంలోని వివిఎస్‌ఎన్ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులతో కలిసి వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల మండలం పి.కొత్తకోటలోని వేము కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, సామాజిక జాగృతి కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీం లీడర్ దివ్య మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ఎన్నో అనర్థాలకు కారణమయ్యే మత్తు పానీయాలు, మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తుకు వెన్నుముకైన యువత దురాలవాట్లకు లోనైతే దేశ ప్రగతి గాడి తప్పే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇకనైనా ప్రజలు మత్తు పానీయాలకు బానిసలు కాకుండా మీ ఆరోగ్యంతో పాటు కుటుంబ సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని దురలవాట్లకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని దివ్యతో పాటు మరికొంత మంది విద్యార్థులు, వివిఎస్‌ఎన్ సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల శాతం పెంచాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులశాతం పెంచాలని అన్నమయ్య జిల్లా డిసిహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను రెఫర్ చేయకుండా, వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయని, ఆసుపత్రికి వచ్చే వారికి అన్ని రకాల పరీక్షలు చేసి, మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, హర్షిత రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న డిసిహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్

ప్రశాంతంగా పండుగ చేసుకుందాం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకుందామని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వం అన్ని విధాల పండగను నిర్వహించుకునేందుకు చర్యలు తీసుకుందని కుర్బానీ ఇచ్చేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో వివిధ చోట శిబిరాలు ఏర్పాటు చేశామని దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అధ్వర్యంలో బక్రీద్ పండగను గతంలో కంటే మరింత ఆనందంగా నిర్వహించుకుందామన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి- రాయచోటి

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఈనెల 23న నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.అల్లా బకాష్ సిఎల్‌పి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పిజిఆర్ గ్రాండ్ మదనపల్లి రోడ్‌లో నిర్వహించబోయే సమావేశానికి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఎఐసిసి సెక్రటరీ మయ్యప్పన్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, హాజరవుతున్నారని తెలిపారు. సంతకాల సేకరణ కార్యక్రమం ఉంటుందని, మధ్యాహ్నం పార్టీ అనుబంధ విభాగాల సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘ సభ్యులు, మహిళా సభ్యులు, యువకులు, ప్రతి ఒక్కరు హాజరై కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గిరిజనుల భూములకు హద్దులు ఏర్పాటు

గిరిజనుల భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-కంభంవారిపల్లె (పీలేరు)

గిరిజనుల భూములకు పెత్తందార్లు ఆటంకం కలిగిస్తున్న నేపథ్యంలో గిరిజన యానాది సేవా సంఘం నాయకుల ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది హద్దులు ఏర్పాటు చేశారు. కెవిపల్లి మండలంలోని మారేళ్ల పంచాయతీ, మంచాల మంద సమీపంలో 1983 సంవత్సరంలో అప్పటి తహశీల్దార్ వెంకట సుబ్బారెడ్డి గిరిజన యానాదులైన సిద్దయ్య, వెంక టయ్య, పాపయ్య కుటుంబాలకు జీవనోపాధి కోసం సర్వే నెం.1516/1, 1516/2, 1517 లో 10.5 ఎకరాలు ప్రభుత్వ భూమిని గిరిజన యానాదులకు పంపిణీ చేశారు. దాన్ని సాగు చేసుకొనే ప్రయత్నంలో ప్రతిసారి అక్కడ నివసిస్తున్న కొంత మంది పెత్తందార్లు గిరిజనులకు అడ్డు తగులుతుండడంతో గిరిజనలకు గొడవ జరిగేది. ఇటీవల మళ్ళీ వారు అడ్డు తగల డంతో గిరిజనులు తహశీల్దారుకు వినతి పత్రం సమర్పించిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు విఆర్‌ఒ దీనా, విఆర్ఎ, సర్వేయర్‌లతో కలిసి, ఎపి గిరిజన యానాది సంఘం నాయకుల సమక్షంలో సరిహద్దు రాళ్లు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఎపి గిరిజన యానాది సంఘం రాష్ట్ర కార్యని ర్వాహక అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ 10.5 ఎకరాలకు సంబంధించి గిరిజన యానాదులకు పట్టాలు కూడా ఉన్నాయని వారు సాగు చేసుకునేందుకు పెత్తందార్లు ఎటు వంటి ఆటంకం కలిగించినా రెవెన్యూ, పోలీస్ అధికారులు తక్షణం వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికా రులు వారి నుండి యానాదులకు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. వారికి ఎటువంటి హాని జరిగినా గిరిజన యానాది సేవా సంఘం ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి, చుక్కలపాటి ఆదినారాయణ, జి.సిద్దు, నారాయణమ్మ, యువ నాయకులు లోకేష్, సుబ్రహ్మణ్యం, గోవిందు, వైసిపి నాయకులు వెంకటరమణ నాయుడు, కొండప్ప నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, వైవి పాలెం మాజీ ఎంపిపి ఓబులేసు, ఈరంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌వలి

సమావేశాలతోనే మహిళల్లో చైతన్యం

ప్రజాశక్తి-వీరబల్లి

మహిళా స్వయం సహాయక సంఘాలకు నిర్వహించే సమావేశాలు వల్ల మహిళల్లో చైతన్యం పెరిగి వారి ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహద పడతాయని వైఎస్‌ఆర్ క్రాంతిపథం సహాయ ప్రాజెక్ట్ మేనేజ్ ఖాదర్‌వలి అన్నారు. బుధ వారం చమర్తివాండ్లపల్లి హైస్కూల్ ఆవరణంలో గుర్రప్పగారిపల్లి గ్రామ సమాఖ్య-1 మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్వయం సహాయక సంఘాలకు ప్రతినెలా సమావేశాలు జరపడం ద్వారా పుస్తక నిర్వహణ, నిర్ణయాలు, రుణాలు మంజూరు, వసూళ్లు చేసుకోవడం సులభమని తెలిపారు. జీవనోపాధి మెరుగుపరుచుకోవడం కోసం ఆర్థికాన్ని బట్టి, రూ.10లక్షల వరకు వ్యక్తిగత రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందు కొస్తున్నాయని అన్నారు. అలాంటి రుణాలు పొందినవారికి పరిశ్రమల శాఖ ద్వారా 35 శాతం సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. ఆడిట్ నివేదిక సభ్యులకు విని పించారు. అనంతరం సమాఖ్య పదాధికారులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా రేవతి, కార్యదర్శిగా బుజ్జమ్మ, కోశాధికారిగా కళావతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిసి నాగేంద్ర, వివిఎ రాజా పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని రెడ్డివారిపల్లి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో వివిధ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను గురువారం భర్తీ చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కెఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో 6,7,8,9 తరగతులలో పరిమితంగా ఖాళీగా ఉన్న సీట్లను ప్రభుత్వ ఆదేశించిన నియమ నిబంధనల ప్రకారం ఈనెల 22న భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు గురువారం ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాలలోని కార్యా లయ సిబ్బందిని సంప్రదించి, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు శ్రీసౌమ్యనాథస్వామి ఆలయం మూసివేత

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయశుద్ధి, సంప్రోక్షణ కారణంగా ఆలయాన్ని మూసివేస్తున్నట్లు చెప్పారు. ప్రక్షాళన, ఆలయాన్ని సందర్శించాలని అనుకునే వారు వాయిదా వేసుకోవాలని కోరారు.

తంబళ్లపల్లె తహశీల్దార్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూతన తహశీల్దార్‌గా శ్రీనివా సులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మదనపల్లెలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో తహశీల్దార్‌గా పనిచేసిన కళావతి బదిలీపై పెనుమూరు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లా డుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను పరిష్క రించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన ధృవపత్రాలను, విద్యార్థులకు కావాల్సిన ధృవపత్రాలను వెంటనే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

నేడు వాహనాలకు వేలం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలోని ములకలచెరువు ఎస్‌ఇబి స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు నేడు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఇబి సిఐ మల్లిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో 20 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనేవారు ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు తీసుకుని వచ్చి పేరు నమోదు చేసుకొని రూ.1000లు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, వేలంలో పాల్గొనని వారు తిరిగి ఆ డబ్బు వాపసు తీసుకోవచ్చని తెలిపారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

అన్నదానం ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నందలూరులో జూలై 4 నుంచి జరగబోయే సౌమ్యనాథస్వామి కల్యాణం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రాజంపేట నియోజకవర్గ యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో టిఫిన్, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేయడానికి సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద స్థలాన్ని పరిశీలించారు. త్వరలో రోజున జరిగే గరుడ సేవకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-[illegible]

టిడిపి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి కోరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో భవిష్యత్ గ్యారంటీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో రాబోయే రోజుల్లో ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, ఏ విధంగా ముందుకు సాగాలి వంటి అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రణాళికాబద్దంగా ముందుకు సాగాలన్నారు. టిడిపి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలు తీర్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, సంజీవ రెడ్డి, సేట్, బయపురెడ్డి పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, MADANAPALLI.
O.S.No. 921/2022
I.A.No. 641/2023
Gummidikayal Reddeppa Reddy. ....వాది
Vs
Gummidikayala Sidda Reddy వగైరా. ....ప్రతివాదులు

NOTICE to (D4)

Chinna Maddannagari Siva Sankar Reddy, S/o Late Chinna Maddannagari Jayachandra Reddy, Hindu, Cultivation, Residing of Vanamareddygari palli @ Peddapalle, H/o. Mattivaripalli, Kurabala kota Mandal, erstwhile Chittor District, now Annamayya District.

రాజీ కోర్టు వారు పై దావా విచారణ 30.06.2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు రాజీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మదనపల్లె కోర్టులో హాజరు కావలెనని ఉత్తర్వు జారీ చేసినారు. కావున పై తేదీన పై గంటలకు మీరు గాని లేదా మీ తరపున వకీలుగాని హాజరు కాని యెడల మీ పరోక్షంలో తీర్పు ఇవ్వబడును.

G.M.REDDY, M.Com.,L.L.B.,
Y.MANOHAR REDDY, B.Com.,B.L.,
G.MALLIKARJUNA, M.Com.,L.L.B.,
K.SRINIVASULU, B.A.,L.L.B.,
Advocates,
MADANAPALLI- 517325.

'ప్రయివేట్' ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎంఇఒకు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రయివేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఎంఇఒ తిరుమలరావుకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12 నుంచి పాఠశాలలో ప్రారంభమయ్యాయని విద్యా హక్కు చట్టం-2009 పాటించకుండా నడుపుతున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు పది సంవత్సరాలు పైగా నేటికీ రేకుల షెడ్లలోనే విద్యార్థులకు చదువులు చెప్పే పరిస్థితి ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల చేత వేలాది రూపాయలు వసూలు చేస్తూ వారి సొంత వ్యాపారాలు చూసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు వివరాలను నోటీసు బోర్డులో ఉంచకుండా నిబంధనలను గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. పాఠశాల ఆవరణలోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం ఇతర స్టేషనరీ కూడా అమ్ముతున్నారని అన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఫీజుల దోపిడీని అరికట్టి పేద విద్యార్థుల ఉన్నత చదువుల ఆశయం నెరవేర్చాలన్నారు.

ఆ ఉపాధ్యాయురాలు మాకొద్దు..!

పాఠశాలకు తాళాలు వేసి తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి- కలకడ

పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆ ఉపాధ్యాయురాలు మాకొద్దంటూ గ్రామస్తులు మూకమ్మడిగా తిరుగుబాటు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ముడియంవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న నాగలక్ష్మమ్మ విద్యార్థులను నిత్యం దూషించడం, కొడుతుండటంతో గ్రామస్తులు గతంలో డిఇఒకు ఫిర్యాదు చేయడంతో ఆమెను సస్పెండ్ చేసిన విషయం విధితమే. సస్పెన్షన్ పూర్తయిన తర్వాత తిరిగి ఇదే పాఠశాలలో విధులకు హాజరవడంతో గ్రామస్తులు ఆగ్రహించి పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ మునీంద్రనాయక్ పాఠశాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ ఉపాధ్యాయురాలు మా పాఠశాలకు వద్దని, వేరే పాఠశాలకు బదిలీ చేయమని ఫిర్యాదు చేశారు. ఎంఇఒ స్పందించి మీ ఫిర్యాదును ఉన్నతాధికారులు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడ తామని హామీనివ్వడంతో తల్లిదండ్రులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, విద్య కమిటీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఇఒలు బాధ్యతలు స్వీకరణ

నిమ్మనపల్లి : అదనపు ఎంఇఒను సన్మానిస్తున్న ఎంఇఒ సిబ్బంది

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలానికి అదనపు రెండవ ఎంఇఒగా సంబేపల్లి మండలం శెట్టిపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఎల్.వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. బుధవారం ఆయన స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంఇఒ చక్రేనాయక్ పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ అనుమతితో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో తన వంతు కృషి చేస్తానని అన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంఇఒ నారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒ-2గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటామని, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పథకం ద్వారా మెరుగైన వసతులు సమకూర్చిందని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, జయరామిరెడ్డి, ఇబ్రహీం, రామచంద్ర, నరసింహులు, సౌజన్య, సిఆర్‌పిలు సుధాకర, పద్మనాభం, మంజుల, స్వాతి పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం

ప్రజాశక్తి-నందలూరు

యోగాతో మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందని జడ్జి కె.లత అన్నారు. బుధవారం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ యోగాసనాలు వేయడం వలన బిపి, మధుమేహం వంటి రుగ్మతలు అదుపులోకి వస్తాయని తెలిపారు. యోగాతో ఆరోగ్యవంతమైనన జీవనశైలి అలవాటు అవుతుందన్నారు. కార్య క్రమంలో యోగగురువు రాజాచారి, గెలివి సురేంద్రకుమార్, యంబలూరు అనిల్ కుమార్, గెలివిశివ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, పిఎల్‌విలు పాల్గొన్నారు. **కలికిరి :** స్థానిక ఎస్‌డబ్ల్యుఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఆయూష్ శాఖఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ సిఇటి-3 కమాండెంట్ రాజేష్‌కుమార్ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెఎన్‌టియు ప్రిన్సిపల్ డాక్టర్ సత్య నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీ సర్ డాక్టర్ సరిత, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎల్.అంజలీదేవి, వైస్. ప్రిన్సిపల్ గులాబ్ జాన్, ఎం.మాధవి, టి.లిఖిత, జి.మాధవి, పి.హాజిరా పాల్గొన్నారు. **రామసముద్రం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగాడేను ప్రిన్సి పల్ మురళీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సత్యనారాయణస్వామీ, బ్రహ్మకుమారి ప్రతినిధులు, అధ్యాపకులు నాగరాజు, భవాని,రవీంద్ర, శివప్రసాద్, చిరంజీవి, దశరథ రామిరెడ్డి, దీప్తి విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక పుంగ నూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మదనపల్లె ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామ లింగా రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ప్రోగ్రాం ఆఫీసర్ వై.అరుణ్‌కుమార్‌రెడ్డి, హెచ్ఒడిలు పాల్గొన్నారు. **కలకడ :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు :** బాలుర ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మహేశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** షీ దివ్య యోగ విద్యాలయంలో 9వ అంతర్జాతీయ యోగా దినో త్సవ వేడుకలను నిర్వాహకులు డాక్టర్ పివిఎస్ లక్ష్మి, షీ సంస్థ న్యాయ సలహా దారులు డాక్టర్.రాయలసుధాకర్ రాయలు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, ఇంటర్నేషనల్ న్యాచురోపతి ఆర్గనైజేషన్, ఆయుష్ శాఖ, వాసవి క్లబ్, మెగా వాసవి క్లబ్, విఎస్ఎన్ విద్యాసంస్థలు, భువన విద్యాలయం, ఎవిఆర్ స్కూల్, సాధన స్కూల్ యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే టిడిపి ధ్యేయం : ఆర్ఆర్

ప్రజాశక్తి-గాలివీడు


ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

మైనార్టీల సంక్షేమమే టిడిపి ధ్యేయమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నూలివీడు గ్రామపంచాయతీలో టిడిపి శ్రేణులతో కలిసి రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ , ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. టిడిపి హయాంలో ముస్లిం మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేసిందన్నారు. ప్రధానంగా ముస్లిం మైనారిటీలకు మసీదు నిర్మాణాలకు నిధులు, హజరత్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ,పెళ్లి కానుక, హజ్‌యాత్రకు నిధులు, విదేశీయ విద్య వంటి వినూత్నపథకాలను అందించారని అన్నారు. వైసిపి ప్రభుత్వం పాలనలో అభివృద్ధి శూన్యమని, అరాచకాలు, ఆగడాలు, పెరిగిపోయాయని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకి నెలకు రూ.1500లు ఆర్థిక సహాయం తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి వెంకటశివారెడ్డి, మాజీ ఎంపిటిసి పార్వతమ్మ , మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య సర్పంచ్‌లు పార్థసారథిరెడ్డి, షబ్బీర్‌బాషా, మహ్మద్ గౌస్‌అమానుల్లా, అజీజ్, కుమార్ నాయుడు, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, ఈశ్వర్‌రెడ్డి, చిన్నపరెడ్డి, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

జీవాల ఆరోగ్యానికి నట్టల నివారణ మందు తాపించాలని పశు సంవర్ధక శాఖ జమ్మలమడుగు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస అన్నారు. మండలంలోని పెనికలపాడు గ్రామంలో బుధవారం డిడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొత్తపల్లి పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస పశు విజ్ఞానబడి, సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించడం వల్ల నులిపురుగులు, బద్దెపురుగు, ఏలిక పాములను నివారించ చవచ్చన్నారు. పాడి రైతులకు, పశు యజమానులకు వైఎస్ఆర్ పశుబీమా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రానున్న వర్షాకాలంలో ఆవులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలన్నారు. సబ్సిడీతో గడ్డి గింజలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు, పశు యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మాదకద్రవ్యాలతో యువత చిత్తు కావద్దు

ప్రజాశక్తి-ములకలచెరువు

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్ఇబి సిఐ మల్లిక అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఐ మల్లికా విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగా హన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత మత్తు పదాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ లేని సమాజాన్ని రూపొందించడానికి అంతర్జాతీయ సమాజం మరింత కృషి చేయాలన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు దూరంగా ఉండి నేటి సమాజాన్ని కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ప్రభు త్వ జూనియర్ కళాశాలలో పది పాసైన బాలికలు ప్రవే శాలు పొందాలని ఆ కళా శాల తెలుగు అధ్యా పకులు చెరుకూరి శ్రీనువాసులు కోరారు. బుధ వారం స్థానిక వైఎస్ఆర్ కాలనీలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కళాశాల కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. తక్కువ ఫీజుతో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించ వచ్చన్నారు. బాలికల కోసం ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాలను ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలు మంజూర వుతాయన్నారు. మంచి బోధన సిబ్బంది కళాశాలలో ఉన్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించేందుకు ముందుకు రావాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్ఎస్.మంథా

నూతన పరిశోధనలకు నాంది పలకాలి

ప్రజాశక్తి-కురబలకోట

ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు నూతన పరిశోధనలకు నాంది పలకాని ఢిల్లీ ఎఐసిటిఇ మాజీ చైర్మన్ ప్రొపెసర్ ఎస్ఎస్.మంథా పేర్కొన్నారు. బుధవారం స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కళాశాల ఎదుగుదల పరిశోధనలు, ప్లేసెమెంట్స్, ఇన్నోవే షన్స్ వాటిపై ఆధారపడి ఉంటుందని, ప్రతి అధ్యాపకుడు నూతన పరిశోధనలకు నాందిపలికి దేశాభి వృద్ధికి తోడ్పడాలని అన్నారు. మిట్స్ కళాశాలలో గల ల్యాబ్‌లు, లైబ్రరీని సందర్శిం చారు. ఫారిన్ యూని వర్సిటీతో కొలాబరేషన్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని, వారితో కలిసి పరిశోధనలు చేయా లని సూచించారు. విద్యార్థులను ఇండస్ట్రీ రెడీ పద్ధతిలో నూతన టెక్నాలజీని పరిచయం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, టిజి.రవికుమార్, ప్రొఫెసర్ నారాయణన్, వైస్ ప్రిన్సిపల్ రామనాథన్, కమల్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న బ్యాంక్ మేనేజర్, ఎంఇఒ

విజేతలకు నగదు అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎంపియుపి స్కూల్లో బుధవారం ఆర్‌బిఐ ఆదేశాల మేరకు కెనరా బ్యాంక్ మేనేజర్ నవీన్‌బాబు, ఎంఇఒ నాగతిరుమలరావు ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యార్థులకు ఆల్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసి క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగింది. బ్యాంకు మేనేజరు, ఎంఇఒలు ప్రశ్నా పత్రాలను ఆవిష్కరించి క్విజ్ నిర్వహించారు. మండల పరిధిలోని 11 హైస్కూళ్ల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొనగా 6 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని అన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ స్వయంగా పేపర్స్ మూల్యాంకనం చేసి విజేతలను ప్రకటించారు. కొత్తపేట జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు బి. వీర బాలు, మధు శైలుకి మొదటి బహుమతిగా రూ.10వేలు నగదు, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎం.ఇందు, సాలెహ పనినో విద్యార్థులకు రెండవ బహు మతి రూ.5వేలు, ఎంపియుపి పుల్లంపేట స్కూల్ విద్యార్థులు బి.కార్తీక, జి.పవన్ సాయి, కౌశిక్‌లకు మూడవ బహుమతిగా రూ.3వేలు అందిం చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వరదారెడ్డి, శ్రీనివాసులు, సైరా భాను, అశోక్, భారతి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశుబీమాపై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల పరిధిలోని గోపిదిన్నె గ్రామం ఉప్పులూరివాండ్లపల్లిలో వైఎస్ఆర్ పశు బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా పశు సంరక్షణ శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ ఆవులు, గొర్రెలు కలిగిన పాడి రైతులందరూ బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. పాడి ఆవుకు రూ.400 మూడు సంవత్సరాల గాను ప్రీమియంను రైతు చెల్లించాలన్నారు. గొర్రెలకు రూ.75లు రెండు సంవత్సరాలకు చెల్లించాలని తెలిపారు. నష్టపరిహార పథకం కింద జిల్లాకు రావాల్సిన రూ.2.5 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, త్వరలో రైతులఖాతాలో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు, సుమిత్ర, గ్రామ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి సుజనశ్రీ, రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సంచరిస్తున్న ఆవులు

రహదారిపై పశువుల సంచారం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

రాజంపేట-నందలూరు మార్గంలో బోయినపల్లి వద్ద పశువులు రహదారికి నిత్యం అడ్డంగా సంచరిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు కడప, తిరుపతి వైపు వెళ్లడానికి నాన తంటాలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో పశువులు పరిగెత్తడం, ఒకదానితో ఒకటి పోట్లాడుకోవడం వల్ల వాహనాలను తగిలి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. జాతీయ రహదారి కావడంతో హైదరాబాదు, చెన్నై నుంచి వేగంగా వాహనాలు వేగంగా వస్తుంటాయని, ఆవుల యజమానులను నోటీసులు అందించి ఆవులను గోశాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డుపై పశువులు అడ్డంగా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారిపై పశువుల సంచారం లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

దళిత యువతిని ప్రేమ పేరుతో వంచన చేసి ఆమెపై అత్యాచారం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని కరెంటు కాలనీలో నివసిస్తున్న ఓ దళిత యువతిని పుల్లంపేట మండలం, టి.కమ్మపల్లిలో నివాసమున్న అగ్రవర్ణ కులానికి చెందిన యువకుడు ప్రేమపేరుతో వంచన చేసి ఆమెపై అత్యాచారం చేశాడని అన్నారు. చివరకు కుల వివక్షతో యువతిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో ఆ యువతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ.రామ్మోహన్ ఆ యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్పి ఆర్.గంగాధర్‌రావు దర్యాప్తు నిమిత్తం ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఎన్.సుధాకర్‌ను నియమించగా డిఎస్‌పి దర్యాప్తు చేసి నిందితుడిపై నేరం నిర్ధారణ కావడంతో మండలంలోని కనికలతోపు బస్‌స్టాప్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నెల రోజుల కిందట జరిగిన ఈ సంఘటనపై విచారణ పూర్తి చేసి మదనపల్లి ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితుడికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర నాయక్ వెల్లడించారు.